Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 291
పేజీలు : 3

గురువారం 21.05.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## మధ్యాహ్నం వేళ ప్రయాణాలు మానుకోండి

### ఎండల దృష్ట్యా ప్రజలకు సీఎం సూచన




**టి మీడియా ,మే 20 ,హైదరాబాద్ బ్యూరో:** ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణలో ఉష్ణ తీవ్రత ఎక్కువగా ఉన్నందు వల్ల అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో హీట్ వేవ్ నేపథ్యంలో ఆయన అధికారులకు కీలక సూచనలు చేశారు. విద్యుత్ సరఫరా, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కీలక సూచన చేశారు. వడదెబ్బతో ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలన్నారు. పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీలైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయవద్దని ప్రజలకు సూచించారు. జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని సీఎస్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## పేదలకు ఉచిత వైద్యం

# తప్పనిసరి..

- ప్రైవేట్ ఆసుపత్రులకు సుప్రీంకోర్టు హెచ్చరిక!
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు





**టి మీడియా ,మే 20 , ఢిల్లీ బ్యూరో:** ఢిల్లీ లో పేదల ఆరోగ్య హక్కును కాపాడటంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది..ప్రభుత్వ రాయితీలు, అనుకూల భూములపై నిర్మించిన ప్రైవేట్ ఆసుపత్రులు పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలని సుప్రీం కోర్టు మరోసారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. 2018లో ఇచ్చిన తీర్పును అమలు చేయడంలో విఫలమవుతున్న ఆసుపత్రులపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది..నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ప్రభుత్వం నుంచి తక్కువ ధరకు భూములు పొందిన ఆసుపత్రులు పేద రోగులకు 10% ఇన్‌పేషెంట్ బెడ్స్ , 25% అవుట్‌పేషెంట్ సేవలు పూర్తిగా ఉచితంగా అందించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందులో మందులు, పరీక్షలు, శస్త్రచికిత్సలు, హాస్పిటల్ ఛార్జీలు అన్నీ ఉచితంగా ఉండాలని పేర్కొంది..మురికివాడల సమీపంలో ఆసుపత్రులు నిర్మించుకుని, పేదలకు వైద్యం అందించడంలో వెనకడుగు వేయడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. సామాన్యులకు వైద్యం అందని ద్రాక్ష కావొద్దు అని కోర్టు గట్టిగా చెప్పింది.నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీం కోర్టు హెచ్చరిక జారీ చేసింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న వందలాది ప్రైవేట్ ఆసుపత్రులపై తీవ్ర ప్రభావం చూపనుంది.

### ఢిల్లీ ఆసుపత్రుల్లో ఏం జరిగిందంటే ?:

ఢిల్లీలోని ప్రైవేట్ ఆసుపత్రులలో ఆర్థికంగా బలహీన వర్గాల వారికి ఉచిత చికిత్సను అమలు చేయడానికి ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించింది..గతంలో ధిక్కార నోటీసులు జారీ చేసిన 51 ఆసుపత్రులలో కేవలం 4 మాత్రమే నిబంధనలను పాటిస్తున్నాయని కోర్టు పేర్కొంది.రాయితీతో ప్రభుత్వ భూములపై నిర్మించిన ఢిల్లీలోని ప్రైవేట్ ఆసుపత్రులలో ఆర్థికంగా బలహీన వర్గాల రోగులకు ఉచిత చికిత్సను అందించాలని ఆదేశించిన తన 2018 తీర్పును సమర్థవంతంగా అమలు చేయడానికి, ఒక ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించడం కోసం ప్రభుత్వ అధికారులు, భూ యాజమాన్య సంస్థలు ప్రైవేట్ ఆసుపత్రులతో కూడిన ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.గతంలో ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అనేక ఆసుపత్రులు నిబంధనల పాటింపు అఫిడవిట్లను దాఖలు చేయడంలో విఫలమయ్యాయని, బలహీన వర్గాల రోగులకు 10% ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్ – ఇక్కడ రోగిని 24 గంటలు లేదా అంతకంటే ఎక్కువ ఆసుపత్రిలో చేర్చుతారు) 25% చికిత్సను ఉచితంగా అందించాలనే నిబంధనను ఉల్లంఘించినట్లు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనల పాటించడం పై ఒక నివేదికను సిద్ధం చేయడానికి న్యాయస్థానం గతంలో సీనియర్ న్యాయవాది సంజయ్ జైన్ న్యాయవాది నినాద్ లాడ్‌లను అమీసీ క్యూరీలుగా నియమించింది. బలహీన వర్గాల ప్రజలకు ఉచిత చికిత్స అందించాలన్న న్యాయస్థానం యొక్క 2018 తీర్పును ఉల్లంఘించినందుకు ధిక్కార నోటీసులు జారీ చేయబడిన 51 ఆసుపత్రులతో పాటు, అమికస్ క్యూరీ మే 10, 2026న సుప్రీంకోర్టు కు ఒక నివేదికను సమర్పించారు. ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డ్ , అధీకృత కాలనీల వద్ద మురికివాడలు, బస్తీల వద్ద ఆసుపత్రులలో చికిత్స పొందడానికి వెళ్ళే వారి డేటా ఆధారంగా నివేదిక రూపొందించారు.

### సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించిన ఆసుపత్రులు:

సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించినట్లు తేలిన 51 ఆసుపత్రులలో, మాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రైమస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వెంకటేశ్వర్ హాస్పిటల్, విమ్హాన్స్ హాస్పిటల్ మూల్‌చంద్ హాస్పిటల్ అనే ఆరు ఆసుపత్రులు మినహా, మిగిలినవన్నీ నిబంధనల పాటింపు అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. 51 ఆసుపత్రులలో, అమర్ జ్యోతి ఆసుపత్రి, భగవతి ఆసుపత్రి, వేణు ఐ ఇన్‌స్టిట్యూట్, జివోదయ ఆసుపత్రి అనే నాలుగు ఆసుపత్రులు మాత్రమే కోర్టు తీర్పును పాటించినట్లు తేలింది. అమికస్ క్యూరీ నివేదికను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, ఉచిత చికిత్స ఆదేశాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి సమన్వయంతో కూడిన సంస్థాగత చర్య అవసరమని పేర్కొంది..దీనికోసం పలు అధికార వర్గాలు, భాగస్వాములతో ఒక సంయుక్త సమావేశం నిర్వహించాలని ఆదేశించింది.

## ఆరు గంటల్లో వాటర్ ట్యాంక్

# టెండర్ ఖరారు

- విమర్శలతో రద్దు చేసిన టీవీకే ప్రభుత్వం




**టి మీడియా ,మే 20 , చెన్నై:** తమిళనాడు సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై మరో వివాదం తెరపైకి వచ్చింది. వాటర్ ట్యాంక్ టెండర్‌ను కేవలం ఆరు గంటల్లో ఖరారు చేయడంపై డీఎంకే మండిపడింది. విమర్శల నేపథ్యంలో ఆ టెండర్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. కాంచీపురం జిల్లాలో 30,000 లీటర్ల సామర్థ్యం గల ఎత్తైన నీటి ట్యాంకు నిర్మాణానికి గ్రామీణాభివృద్ధి శాఖ మే 19న టెండర్లను ఆహ్వానించింది. రూ.16.83 లక్షల విలువైన ఈ కాంట్రాక్టు వివరాలను ఆ రోజు ఉదయం 9 గంటలకు వెబ్‌సైట్‌లో ఉంచింది. బిడ్ సమర్పణ గడువు అదే రోజు మధ్యాహ్నం 3 గంటలుగా నిర్ణయించారు. దీంతో టెండర్‌లో పాల్గొనేవారికి కేవలం ఆరు గంటల సమయం మాత్రమే లభించింది. కాగా, ఈ టెండర్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తక్కువ వ్యవధిలో బిడ్డింగ్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. టెండర్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై డీఎంకే మండిపడింది. ఒక నిర్దిష్ట కంపెనీకి ప్రయోజనం చేకూర్చేందుకే ఈ టెండర్‌ను రూపొందించినట్లు ఆరోపించింది.మరోవైపు ఏదైనా కంపెనీ ఆరు గంటల్లోగా డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను సిద్ధం చేసి, అన్ని లాంఛనాలను వాస్తవంగా ఎలా పూర్తి చేస్తుంది? అని డీఎంకే రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ అముతరసన్ ప్రశ్నించారు. 'ఇది పరిపాలనా వేగం కాదు. ముందుగా ప్రణాళిక వేసుకున్న కాంట్రాక్ట్ రాజకీయాలు' అని మంత్రి ఎన్. ఆనంద్‌ను విమర్శించారు. దీనిపై విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. ఈ విమర్శల నేపథ్యంలో పరిపాలన కారణాలు పేర్కొంటూ అదే రోజున ఆ టెండర్‌ను ప్రభుత్వం రద్దు చేసింది.

# ఆధారాలు మాయం

## చేసిన బండి భగీరథ్

- మరో సెక్షన్ పెట్టిన పోలీసులు




**టి మీడియా ,మే 20 ,హైదరాబాద్ బ్యూరో :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోక్సో కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను నిందితుడు బండి భగీరథ్ మాయం చేసినట్లుగా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో ఎవిడెన్స్ మాయం చేసిన నేరం కింద సెక్షన్ 238ను జోడించినట్లు సమాచారం.బండి భగీరథ్ పరారీలో ఉన్నప్పుడు ఆధారాలు మాయం చేసి, పథకం ప్రకారమే పోలీసులకు చిక్కాడని ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. విచారణ సమయంలో పోలీసులకు ఖాళీ ఫోన్ మాత్రమే ఇచ్చాడని.. సిమ్ కార్డు ఎక్కడ అని ప్రశ్నిస్తే.. ఎక్కడో పెట్టి మరిచిపోయానని సమాధానమిచ్చాడు. దీంతో కేసులో ఆధారాలు మాయం చేసిన నేరం కింద సెక్షన్ 238ను

మిగతా 3లో..

# మెడికల్ షాప్‌ల బంద్

- తెలంగాణ వ్యాప్తంగా 25 వేలకు పైగా దుకాణాల మూసివేత




**టి మీడియా ,మే 20 ,హైదరాబాద్ బ్యూరో:** దే ఆన్‌లైన్‌లో ఔషధాల డెలివరీని వ్యతిరేకిస్తూ మెడికల్ షాప్‌ల బంద్?కు ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ పిలుపునిచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా 12 లక్షలకు పైగా మెడికల్ దుకాణాలను మూసివేశారు. తెలంగాణలో 25 వేలకు పైగా ఔషధ దుకాణాలను మూసివేయగా, ఒక్క హైదరాబాద్‌లోనే 12 వేలకు పైగా బంద్?ను పాటిస్తున్నాయి. ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులకు మాత్రం మినహాయింపు ఉంది.

### 24 గంటలు అందుబాటులో ఉంచాలి

ప్రజలకు అత్యవసర మందులను ఇబ్బంది లేకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 గంటలు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అధికారులను ఆదేశించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్, బస్తీ దవాఖానాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బుధవారం 24 గంటల పాటు ఫార్మసీలు తెరిచి ఉంచాలని చెప్పారు. ఫార్మసిస్టులు కూడా అందుబాటులో ఉండాలని, డ్రగ్ కంట్రోల్ అథారిటీ వారు ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మరో వైపు డీసీఏ కూడా ప్రజలకు మెడికల్ షాపుల బంద్‌పై పలు సూచనలు చేసింది.

### మా దుకాణాల్లో సేల్స్ తగ్గిపోతున్నాయి

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపులను మూసివేసి దుకాణదారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఔషధాల విక్రయాలను నిలిపివేయాలని నినాదాలు చేశారు. దీంతో జిల్లాలోని 475 మెడికల్ షాప్స్ మూతపడ్డాయి. ఈ సందర్భంగా సీపీఐ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ జిల్లా అధ్యక్షుడు సంపత్ రావు మాట్లాడుతూ అన్ని రకాల అనుమతులు తీసుకొని, లైసెన్స్‌దారుల వద్ద మెడిసిన్స్ కొనుగోలు చేసి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఔషధాల విక్రయాలతో చిన్న దుకాణాలలో సేల్స్ తగ్గి మూతపడుతున్నాయని, కార్పొరేట్ సంస్థల డిస్కౌంట్ మాయాజాలంతో జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.తమ దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఔషదాలు విక్రయించాలని ఆంక్షలు విధిస్తున్నారని, ఆన్‌లైన్‌లో మాత్రం ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకున్నా ఔషధాలను ఎలా ఇంటికి డెలివరీ చేస్తారని, మత్తు మందులను కూడా ఎలా విక్రయిస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆన్‌లైన్‌లో ఔషధాల విక్రయాలను నిలిపివేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లాలోని ఔషధ దుకాణదారులు పాల్గొన్నారు.


### డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలా?

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో మెడికల్ షాపులు బంద్ చేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెడికల్ షాపుల నిర్వాహకులు నిరసన తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా మెడికల్ షాప్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బుక్క చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆన్?లైన్?లో మెడిసిన్స్ అమ్మకాలపై నిషేధం విధించి, నకిలీ, నాసిరకం మందులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే మెడిసిన్స్ ఇవ్వకూడదనే నిబంధన ఉన్నప్పుడు ప్రభుత్వం ఆన్?లైన్?లో ఔషధాల అమ్మకాలను ఎలా ప్రోత్సహిస్తుందని ప్రశ్నించారు. ఆన్?లైన్?లో మందుల డెలివరీ వల్ల యువత మత్తు మందులకు అలవాటు పడే అవకాశం ఉందని, ప్రభుత్వం వెంటనే దీనిని నిషేధించాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ ఛార్జీలపై కేంద్రం

# షాకింగ్ డెసిషన్..

- త్వరలో పెరగనున్న బిల్లు



**టి మీడియా ,మే 20 , ఢిల్లీ బ్యూరో:** దేశ ప్రజలకు కేంద్రం షాకివ్వనుంది. రానున్న రోజుల్లో విద్యుత్ బిల్లు మరింత పెరగనుంది. విద్యుత్ టారిఫ్ విధానంలో కేంద్రం మార్పులు చేసేందుకు సిద్ధమవుతోంది. విద్యుత్ కస్టమర్లపై విధిస్తున్న స్థిర ఛార్జీలను పెంచాలని కేంద్ర విద్యుత్ అథారిటీ ప్రతిపాదించింది. డిస్కంలపై భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చాలా పరిశ్రమలు, సంపన్నులు సొంత విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నారు. రూఫ్‌టాప్ సోలార్, క్యాప్టివ్ పవర్ వంటివి ఏర్పాటు చేసుకుంటున్నారు. దీని వల్ల విద్యుత్ కొనుగోళ్లు తగ్గడంతో డిస్కంలకు ఆదాయం కూడా పడిపోతుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్థిర ఛార్జీలను పెంచాలని కేంద్రం భావిస్తోంది.

### దశలవారీగా స్థిర ఛార్జీలు పెంపు

అయితే ఒకేసారి కాకుండా దశలవారీగా స్థిర ఛార్జీలను పెంచాలని కేంద్ర విద్యుత్ అథారిటీ ప్రతిపాదించింది. 2030 నాటికి గృహ, వ్యవసాయ వినియోగదారుల నుంచి 25 శాతం స్థిర వ్యయాలను వసూలు చేయాలని సిఫార్సు చేసింది. ఇక పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్ వినియోగదారుల నుంచి 100 శాతం స్థిర ఛార్జీలను వసూలు చేయాలని సూచించింది. దీంతో రానున్న కొన్ని ఏళ్లల్లో విద్యుత్ బిల్లులో నెలవారీ స్థిర ఛార్జీలు పెరగనున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం తగ్గినా స్థిర ఛార్జీలు భవిష్యత్తులో చెల్లించాల్సి ఉంటుందని చెప్పవచ్చు. ప్రస్తుతం డిస్కంలకు ఆదాయం విద్యుత్ ఛార్జీల నుంచే వస్తోంది. డిస్కంల ఆదాయంలో స్థిర ఛార్జీల భాగం తక్కువగా ఉంది. దీంతో విద్యుత్ వినియోగం తగ్గినప్పుడు ఆదాయం కూడా తగ్గుతుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్థిర ఛార్జీలను సవరించాలని విద్యుత్ అథారిటీ సూచించింది.

### విద్యుత్ కంపెనీలపై తగ్గనున్న భారం

విద్యుత్ కంపెనీలకు వచ్చే ఆదాయం ఉద్యోగులు జీతాలు, నెట్ వర్క్ నిర్వహణ, విద్యుత్ ఉత్పాదక సంస్థలకు చెల్లింపులకు సరిపోతుంది. ఇటీవల రూఫ్‌టాప్ సోలార్ సిస్టంల సంఖ్య పెరుగుతోంది. సొంత విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటున్న కంపెనీలు గ్రిడ్ నుంచి కొనుగోళ్లను తగ్గించాయి. అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఈ కారణంతో విద్యుత్ సంస్థలకు ఆదాయం తగ్గుతుంది. ఈ క్రమంలో రూఫ్ టాప్ సోలార్, నెట్ మీటరింగ్ వినియోగదారుల కోసం ప్రత్యేక టారిఫ్ విధానాన్ని అమలు చేయాలని కేంద్రం విద్యుత్ సంస్థ సిఫార్సు చేసింది. గ్రిడ్‌ను ఉపయోగించే వినియోగదారులు దాని నిర్వహణ ఖర్చులకు కూడా సహకరించేలా కొత్త రూల్ తీసుకురానున్నారు. ఈ చర్య విద్యుత్ కంపెనీలపై భారం తగ్గిస్తుంది.

## రేషన్ కార్డు ఉంటే

# అకౌంట్లోకి రూ.5 లక్షలు..

- తెలంగాణ ప్రభుత్వం కొత్త పథకం




**టి మీడియా ,మే 20 ,హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణ ప్రజలకు రేవంత్ సర్కార్ భారీ గుడ్ న్యూస్ అందించనుంది. జూన్ 2వ తేదీన కీలక పథకానికి శ్రీకారం చుట్టనుంది. అదే ఇందిరమ్మ జీవిత బీమా పథకం. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన ఈ పథకం ప్రారంభించేందుకు రేవంత్ సర్కార్ సమాయత్తం అవుతోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని పేదలకు రూ.5 లక్షల బీమా అందించనుంది. రేషన్ కార్డు ఉన్నవారందరికీ ఈ పథకం వర్తించనుంది. కుటుంబ యజమాని మరణిస్తే కుటుంబసభ్యులకు రూ.5 లక్షల సాయం అందించనుంది. దీంతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలను కూడా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.

### జూన్ 2 నుంచి అమలు

ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలు చేసేందుకు జూన్ 2న ఎల్ఐసీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకునే అవకాశముందని తెలుస్తోంది. గతంలో ఆ స్కీమ్ గరించి మీడియా సమావేశంలో రేవంత్ వెల్లడించారు. జూన్ 2 నుంచి దీనిని అమలు చేస్తామని ప్రకటించారు. త్వరలో గడువు తేదీ దగ్గర పడుతుండటంతో పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పీడ్ పెంచింది. దీంతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలను కూడా కాంగ్రెస్ సర్కార్ ప్రారంభించనుంది. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు కొత్త పింఛన్లను అందించలేదు. దీంతో 2 లక్షల మందికి కొత్తగా పింఛన్లు అందించాలని ప్రభుత్వం చూస్తోంది. పింఛన్ పెంపుపై కూడా ఓ నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.

### రెండో దశ ఇళ్లకు నిధులు

ఇక ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రెండో దశ ఇళ్ల మంజూరుకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రెండో దశలో చేపట్టనున్న ఇళ్ల నిర్మాణాలకు జూన్ 2వ తేదీ నుంచి నిధులు విడుదల చేయనుంది. అంతేకాకండా అదే రోజున మరో కార్యక్రమం కూడా చేపట్టనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబసభ్యులు డిజిటల్ హెల్త్ కార్డులను అందించనున్నారని తెలుస్తోంది. ఈ కార్డులతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ పొందవచ్చు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులకు ఈ స్కీమ్ అమలు చేసేందుకు ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అలాగే కార్డులను జారీ చేసేందుకు డేటాను కూడా సేకరించింది. మే 31లోగా డేటా సేకరణ ప్రక్రియ పూర్తి కానుంది. ఇక జూన్ 2న సనత్ నగర్ టిమ్స్ ప్రారంభం, నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉపాధి పొందేలా శిక్షణ వంటి కార్యక్రమాలు ప్రారంభించనుంది.

## కెమెరా కన్ను

# చూడలేనంటోంది

- ఉన్నవి 12 లక్షలు
- పని చేసేవి 3.8 లక్షలు

3లో..

# ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవద్దు



- అది ప్రజాతీర్పునకు వ్యతిరేకం
- టీవీకేకు సీపీఐ(ఎం) హెచ్చరిక

**టీ మీడియా, మే 20, చెన్నై :** తమిళనాట విజయ్? నేతృత్వంలోని టీవీకే సర్కార్?కు ఆదిలోనే తీవ్ర అడ్డంకులు ఏర్పడుతున్నాయి. టీవీకే సర్కార్? ఒకవేళ ఏఐఏడీఎంకే మద్దతు స్వీకరించినా లేదా ఆ పార్టీని మంత్రివర్గంలో చేర్చుకున్నా, తాము వెలుపల నుంచి ఇస్తున్న మద్దతును పునఃసమీక్షించుకోవాల్సి ఉంటుందని సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం హెచ్చరించారు. తిరువారూర్ జిల్లా తిరుతురైపూండిలో విలేకరులతో మాట్లాడిన షణ్ముగం, రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వాన్ని కాపాడటానికి మాత్రమే విజయ్ సర్కార్?కు మద్దతు ఇచ్చామని తెలిపారు. గవర్నర్ పాలన పేరుతో దొడ్డిదారి గుండా బీజేపీ అధికారంలోకి రాకుండా నిరోధించడానికే తాము టీవీకేకు అండగా నిలిచామని పేర్కొన్నారు. "108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే హక్కు ఉంది. అందుకే బీజేపీ ప్రభుత్వం గవర్నర్ పాలన పేరుతో ఇక్కడ దొడ్డిదారిన పాలన చేయకూడదని మేము భావించాం. తమిళనాట మళ్లీ ఎన్నికలు జరగకూడదనే ఉద్దేశంతోనే మేము విజయ్ సర్కార్?కు మద్దతు ఇచ్చాం" అని అన్నారు.అయితే అధికార పార్టీ ఆ దిశగా అడుగులు వేయదని తాము ఆశిస్తున్నట్లు పి.షణ్ముగం పేర్కొన్నారు. కానీ ఒక వేళ ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవాలనే నిర్ణయమే తీసుకుంటే, తాము ఇస్తున్న మద్దతును సమీక్షించుకోవడానికి వామపక్ష పార్టీలు సిద్ధంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఇక ఏఐఏడీఎంకే అంతర్గత పరిణామాలపై స్పందిస్తూ, ఆ పార్టీలో వర్గ పోరాటాలు కొత్తేమీ కాదని అన్నారు. వాటిని ప్రజల సంక్షేమంతో సంబంధం లేని అంతర్గత విషయాలుగా షణ్ముగం అభివర్ణించారు.

ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో భాగంగా సీపీఐ(ఎం), సీపీఎంలు పోటీ చేసి, చెరో రెండేసి స్థానాలను గెలుచుకున్నాయి. మరోవైపు విజయ్ టీవీకే పార్టీ 108 స్థానాల్లో జయకేతనం ఎగురవేసి, అతిపెద్ద పార్టీగా నిలిచింది. అయితే మ్యాజిక్ ఫిగర్?కు 10 స్థానాల దూరంలో నిలిచిపోయారు. దీనితో అక్కడ గవర్నర్ పాలన గానీ, మళ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు గానీ ఉన్నాయనే వార్తలు వచ్చాయి. మరోవైపు డీఎంకే, ఏఐఏడీఎంకేలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయనే రూమర్స్ కూడా వచ్చాయి. అయితే డీఎంకే కూటమి నుంచి అనూహ్యంగా కాంగ్రెస్ బయటకు వచ్చి విజయ్?కు మద్దతు ఇచ్చింది. తర్వాత సీపీఐ(ఎం), వీకేసీ, ఐయూఎంఎల్ తదితర పార్టీలు ఆయను మద్దతు ప్రకటించాయి. దీనితో విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇక ఫ్లోర్ టెస్ట్ సమయానికి ఏఐఏడీఎంకే నుంచి గెలిచిన కొందరు ఎమ్మెల్యేలు కూడా విజయ్?కు సపోర్ట్ చేయడం గమనార్హం.

**వీసీకే, ఐయూఎంఎల్?కు ఆహ్వానం**

మరోవైపు రాష్ట్రమంత్రివర్గంలో చేరాలని తమిళనాడు ప్రజా పనులు, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి అధవ్? అర్జున బుధవారం వీసీకే, ఐయూఎంఎల్? పార్టీలకు ఆహ్వానం పలికారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనే లక్ష్యంతో డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీలు పరస్పరం చేతులు కలిపి, టీవీకీ సర్కార్ ఏర్పడకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించాయని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి విజయ్? తన మంత్రివర్గం ఒకే కుటుంబంలా పనిచేయాలని ఆశిస్తున్నారని, వామపక్ష పార్టీలను కూడా తన మంత్రివర్గంలో చేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారని అధవ్ అర్జున పరోక్షంగా సూచించారు.

**మంత్రివర్గంలో చేరికపై ఆలోచిస్తాం!**

మరోవైపు రాష్ట్ర మంత్రి వర్గంలో చేరాలంటూ టీవీకే నేత అధవ్? అర్జున ఇచ్చిన ఆహ్వానంపై, వీసీకే అధ్యక్షుడు థోల్? తిరుమావలవన్ తనదైన రీతిలో? స్పందించారు. "మేము టీవీకే ఆహ్వానాన్ని గౌరవిస్తున్నాం. మేము ప్రస్తుతం డీఎంకే కూటమిలోనే ఉన్నాం. అయితే మా పార్టీ ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జరిగినప్పుడు, చాలా మంది మంత్రివర్గంలో భాగం కావాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మేము పార్టీ కార్యకర్తలతో కూడా చర్చించి, మా నిర్ణయాన్ని ప్రకటిస్తాం" అని అన్నారు.



## హామీలు అమలు చేయాలి

**టీ మీడియా, మే 20, ఆత్మకూరు :**

కాంగ్రెస్ఎన్నికల్లో ఐకేపి వివో ఏ లకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉప్పేర్ నరసింహ,వివి నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక వాల్మీకి కమ్యూనిటీ హాల్ లో జరిగిన ఐకేపి వివో ఏ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఐకేపి వివో ఏ లకు 20,000 వేతనం ఇస్తామని, అర్హులైన వివో ఏ లకు సీసీ లుగా పదోన్నతులు కల్పిస్తామని, అదనపు పని భారాలు తగ్గిస్తామని తదితర అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. కానీ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోగ,జాబ్ చార్ట్ లో లేని పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు నిర్వహించవలసిన ధాన్యం కొనుగోలు సెంటర్ ల దగ్గర వివో ఏ లదే పూర్తి బాధ్యత అని ప్రభుత్వం చెబుతున్నప్పటికి, క్షేత్ర స్థాయిలో రాజకీయ నాయకుల జోక్యం పెరిగిందని, రాజకీయ నాయకులు చేసే తప్పిదాలకు వివో ఏ లను బలి పశువులను చేస్తున్నారని, అందులో భాగంగానే తెలుగోని పల్లి గ్రామానికి చెందిన వివో ఏ అలివేలమ్మను సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం(సిఐటియు అనుబంధం) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డ్యామ్ అంజి,తిమ్మప్ప మాట్లాడుతూ ప్రభుత్వం తమ యూనియన్ నాయకత్వంలో చేసిన దశల వారి పోరాటాల ఫలితంగా అనేక హామీలు ఇచ్చిందని అన్నారు. జూన్ రెండు లోపు తమకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే దీర్ఘకాల ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తిరుమలేష్,వివిధ మండలాల నాయకులు కృష్ణారావు, మహేంద్ర,సరస్వతి,రాదమ్మ,ఈదన్న,లావణ్య లక్ష్మన్న, జేఏసీ నాయకులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌లైట్ ఏరియా పిల్లల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్

- చదువుతోపాటు ఆర్థిక భద్రత కల్పిస్తున్న పోలీస్ పాఠశాల

**టి మీడియా ,మే 20 , ఢిల్లీ బ్యూరో :** మన దేశంలో మురికివాడల్లోని, రెడ్?-లైట్ ఏరియాలోని పిల్లలు చాలా దుర్భరమైన జీవితం గడుపుతుంటారు. వారికి సరైన విద్య ఉండదు, జీవితానికి సరైన భరోసా కూడా లభించదు. అందుకే అలాంటి బాలబాలికలను తమ అక్కున చేర్చుకొని విద్యాతో పాటు పొదుపు పాఠాలు నేర్పిస్తోంది ఓ పోలీసు పాఠశాల. ఏంటీ నమ్మలేకపోతున్నారా? అయితే ఈ కథనం పూర్తిగా చదివేయండి. బిహార్?లోని ముజఫర్?పూర్? నగరంలో ఈ గొప్ప కార్యక్రమం జరుగుతోంది. అక్కడి రెడ్?-లైట్? ఏరియా, మురికివాడల్లోని పిల్లల జీవితాల్లో కన్వాలి పోలీస్? అవుట్?పోస్టు సరికొత్త వెలుగును నింపుతోంది. అక్కడున్న పోలీసు పాఠశాల పిల్లలకు కేవలం చదువు చెప్పడమే కాదు, వారికి ఆర్థికంగా నిలబడే ధైర్యాన్ని ఇస్తోంది. దీనితో ఒకప్పుడు ఖాకీ చొక్కా కనిపిస్తే భయంతో పారిపోయే చిన్నారులు, ఇప్పుడు అదే పోలీసు అధికారులను చూడగానే ఎంతో ప్రేమతో, గర్వంగా జై హింద్? అంటూ సెల్యూట్ చేస్తున్నారు.



కన్వాలి పోలీస్ చౌకీలో మొదలైన ఈ పోలీసు పాఠశాల ముఖ్య ఉద్దేశం, సమాజం వెలివేసిన రెడ్?లైట్? ఏరియా పిల్లలను కూడా అందరిలానే చదువు వైపు మళ్లించడం. ఈ చిన్న ప్రయత్నం కాలక్రమేణా ఒక సామాజిక ఉద్యమంలా మారిపోయింది. ఇక్కడి పిల్లలకు కేవలం అక్షరాలు నేర్పడం కాదు, వారు సమాజంలో తల ఎత్తుకొని స్వయంసమృద్ధితో జీవించేలా తీర్చిదిద్దుతున్నారు. మొదట్లో ఇక్కడికి కేవలం 15 మంది పిల్లలు మాత్రమే వచ్చేవారు. కానీ నేడు ఆ సంఖ్య 150కు చేరుకుంది.

### చిరుప్రాయంలోనే పొదుపు పాఠాలు

సాధారణంగా చిన్నపిల్లలు మట్టి పిడతలు/గల్లగురిగిలో చిల్లర డబ్బులు వేసుకుంటారు. ఇదే ఐడియాను ముజఫర్?పూర్ పోలీసులు కూడా అనుసరించారు. మురికివాడలు, రెడ్?-లైట్ ఏరియా పిల్లలకు సైతం పొదుపు అలవాట్లు చేయడం కోసం 'గుల్లాక్? బ్యాంక్?' ఏర్పాటు చేశారు. దీనిలో ప్రతి చిన్నారి తమ వ్యక్తిగత ఖాతాలో నెలకు రూ.50 చొప్పున వేస్తాడు. ఇక ఆ పిల్లల పుట్టినరోజు వస్తే, వారి అకౌంట్లో నేరుగా రూ.500 జమ చేస్తారు. అలా ఏడాది తిరిగే సరికి ప్రతి చిన్నారి పేరు మీద రూ.1,100 ఉండేలా చక్కని వ్యవస్థను రూపొందించారు. దీనికి మంచి స్పందన వచ్చింది. పిల్లలు ప్రతినెలా జాగ్రత్తగా తమ డబ్బులను పొదుపు చేసుకోవడం ప్రారంభించారు.దీనితో పోలీస్ పాఠశాల నిర్వాహకులు, ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. క్లాసులో బాగా చదువుతున్న, ప్రతిభావంతులైన పిల్లలను ఎంచుకొని, వారు చేసిన పొదుపునకు, తమ వంతుగా మరికొంత కలిపి, దాన్ని ఫిక్స్?డ్ డిపాజిట్ (ఎఫ్?డీ) చేశారు. ఆ బ్యాంకు పాస్?బుక్?లను ఆ చిన్నారుల చేతికి అందించారు. ఈ విధంగా ఆ చిన్నారుల భవితకు మంచి భరోసా కల్పించే కార్యక్రమం చేపట్టారు.

ఇంతకీ ఈ పాఠశాల లక్ష్యం ఏమిటి?

### అలా మొదలైంది!

2013 దీపావళి పండుగ ముగిసిన తర్వాత కన్వాలి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ స్కూల్ ప్రారంభం చేశారు. ఈ ప్రాంతానికి చెందిన నసీమా ఖాతూన్? అనే సామాజిక కార్యకర్త ఈ అద్భుతమైన ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఈ పాఠశాల ప్రతిరోజూ సాయంత్రం 5.30 గంటల తర్వాత ప్రారంభమవుతుంది. అక్కడ ఏఎస్?పీగా పనిచేస్తున్న అవదేశ్? దీక్షిత్ స్వయంగా పిల్లలకు పాఠాలు చెబుతారు. అక్కడికి వచ్చే పిల్లలందరికీ పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలు అన్నీ ఉచితంగా ఇస్తారు. మరోవైపు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కార్పొరేట్? సామాజిక బాధ్యత (సీఎస్?ఆర్?) కింద పిల్లలకు కంప్యూటర్లు, స్కూల్ యూనిఫారమ్?, తాగునీటి కోసం కూలర్? ఇచ్చింది. ఈ సందర్భంగానే పిల్లలకు బ్యాంకు పాస్?బుక్?లు కూడా అందించింది.

సిటీ ఎస్పీ మొహిబుల్లా అన్సారీ మాట్లాడుతూ, "సమాజంలో కనీస గుర్తింపు కోసం పోరాడే పిల్లలకు ఈ పోలీసు పాఠశాల ఒక గొప్ప జీవితాన్ని ఇస్తోంది. ఈ రోజు ఈ పిల్లలు పూర్తి ఆత్మవిశ్వాసంతో చదువుకుంటూ, తమ భవిష్యత్?ను తామే మార్చుకుంటున్నారు" అని అన్నారు.

## మైనర్ ని సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్న కానిస్టేబుల్



**టి మీడియా ,మే 20 ,హైదరాబాద్ బ్యూరో :** చట్టాన్ని రక్షించాల్సిన ఓ పోలీస్ కానిస్టేబుల్‌నే దాన్ని ఉల్లంఘించాడు. బాల్య వివాహాలు నేరమని తెలిసి కూడా ఓ మైనర్ అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన నాయిని అనిల్ కుమార్ గౌడ్ భువనగిరిలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన అనంతగిరి మండలానికి చెందిన ఓ బాలికను రహస్యంగా వివాహం చేసుకున్నాడు. బాల్య వివాహాలు చేసుకోవడం నేరమని తెలిసి కూడా ఓ కానిస్టేబుల్ మైనర్‌ను వివాహం చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. దీంతో వారు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అధికారులు హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడు అనిల్ కుమార్ గౌడ్‌పై బాల్య వివాహాల నిరోధక చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.


## జాతీయ సాంకేతిక దినోత్సవం



**టీ మీడియా, మే 20, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని మై భారత్ ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రగతి ఐటిఐ కళాశాల నందు విద్యార్థులకు ఎస్ఐ రైటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ల మై భారత్ యువజన అధికారి కోట నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో పోక్రాన్ పరీక్షలతో పెరిగిన భారత కీర్తి ఎంతో విలువైనది వాజ్పేయి ప్రధానిగా ఉన్న సమయంలో ఫోక్రాన్ అనుపరీక్షలను విజయవంతంగా నిర్వహించి భారత కీర్తిని చాటారని అంతేకాకుండా సాంకేతిక పరిజ్ఞాన విషయాలను ఎన్నో రకాలుగా నైపుణ్యాలను నేర్చుకుని వ్యక్తిగతంగా మరియు దేశ ఔన్నత్యాన్ని పెంచే దిశగా మనం ఎదగాలని సూచించారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం సాంకేతిక కోర్సులలో విద్యార్థులకు అన్ని రకాలుగా ఉపయోగపడే విధంగా పరికరాలను కొత్త రకమైన కోర్సులను అందిచడం జరిగిందని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది.తదనంతరం ఎస్సై రైటింగ్ లో ప్రథమ, ద్వితీయ వచ్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది అట్టి కళాశాల ప్రిన్సిపాల్ ని యాజమాన్యాన్ని సన్మానించడం కూడా జరిగింది.జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా గుర్తుగా విద్యార్థులతో కలిసి చెట్లను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్ గౌడ్ జిల్లా వాలంటీర్ అభిలాష్ హౌదేకార్, గజరాజుల తిరుమలేష్, కళాశాల ప్రిన్సిపాల్ వారి బృందం పాల్గొనడం జరిగింది.

## నిప్పుల కుంపటిలా రాష్ట్రం

**- పిడుగురాళ్లలో 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**



**టి మీడియా ,మే 20 పల్నాడు :** భానుడి భగభగలతో రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారుతోంది. ఈ రోజు(బుధవారం) ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. నిన్న(మంగళవారం) పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 45.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో 44.9, కృష్ణా జిల్లా కంకిపాడులో 44.5 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 23 జిల్లాల్లోని 233 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలానే ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

### రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాబోయే 7 రోజుల పాటు అన్ని పట్టణ స్థానిక సంస్థలు అత్యవసర వాతావరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించింది. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. ముఖ్యంగా మధ్య, ఉత్తర కోస్తా జిల్లాల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈనెల 26 వరకు వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎండల బారిన పడే ప్రమాదం ఉన్న ప్రజలను రక్షించడానికి, పౌర సేవలకు అంతరాయం కలగకుండా చూడడానికి వడదెబ్బ మరణాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# బుల్డోజర్ యాక్షన్‌పై మమత ఫైర్

### మైనార్టీలు, వీధి వ్యాపారులే బీజేపీ లక్ష్యమంటూ ఆరోపణలు

**టి మీడియా ,మే 20 , ఢిల్లీ బ్యూరో :** బంగాల్?లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'బుల్డోజర్ సంస్కృతి'కి వ్యతిరేకంగా మే 21న భారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ (ఏఐటీసీ) ప్రకటించింది. బీజేపీ ప్రభుత్వం వచ్చాక వీధి వ్యాపారులను బలవంతంగా ఖాళీ చేయించడం, మైనార్టీ వర్గాలను లక్ష్యంగా చేసుకోవడాన్ని నిరసిస్తూ కోల్‌కతా, పరిసర ప్రాంతాల్లో ఈ నిరసనలు నిర్వహించనున్నట్లు పార్టీ తెలిపింది. హౌరా స్టేషన్, శీల్దా స్టేషన్, బాలిగంజ్ సమీప ప్రాంతాల్లో ఈ ఆందోళను చేపట్టనున్నారని టీఎంసీ తెలిపింది. వీధి వ్యాపారుల దుకాణాలను కూల్చివేయడం, చిన్న వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడంపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోందని పార్టీ పేర్కొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనేలా ఆందోళనలు చేపట్టనున్నారు.

### మైనార్టీలను లక్ష్యంగా చేస్తున్నారు

మంగళవారం కాళీఘాట్‌లో జరిగిన పార్టీ ఎమ్మెల్యేల సమావేశంలో టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 'మైనార్టీ వర్గాలను లక్ష్యంగా చేస్తున్నారు. వీధి వ్యాపారుల దుకాణాలను బుల్డోజర్లతో కూల్చేస్తున్నారు. ఈ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను



దెబ్బతీస్తోంది. రాబోయే రోజుల్లో ఢిల్లీలో బీజేపీ అధికారాన్ని కోల్పోతుంది' అని వ్యాఖ్యానించారు. టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తన ఇల్లు కూల్చినా, నోటీసులు ఇచ్చినా , వాళ్లు ఏం చేయాలనుకున్నా భయపడనని చెప్పారు. ఎన్నికలలో ఓటమి పాలైనప్పటికీ, బీజేపీకి వ్యతిరేకంగా తమ రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### అభిషేక్‌పై కేసు నమోదు

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో అభిషేక్ బెనర్జీపై బిధాన్‌నగర్ నార్త్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. మహేశ్తల, ఆరాంబాఘ్, హరింఘాటా, నందిగ్రామ్ ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అభిషేక్ బెనర్జీ రెచ్చగొచ్చే, బెదిరింపు ప్రసంగాలు చేశారని, అవి హింసను ప్రేరేపించి, ప్రజాశాంతికి భంగం కలిగించగలవని రాజీబ్ సర్కార్ ఫిర్యాదు చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్?షా పై చేసిన వ్యాఖ్యలు కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు. 'అభిషేక్ బెనర్జీ ఆఫిషియల్' ఫేస్‌బుక్ ఖాతా సహా పలు సోషల్ మీడియా వేదికల ద్వారా ఆ వ్యాఖ్యలు ప్రచారం అయ్యాయని పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత, ప్రజాప్రతినిధుల చట్టం 1951లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### ఎన్నికల అనంతర హింసపై హైకోర్టుకు టీఎంసీ

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం బంగాల్?లో జరిగిన హింసాత్మక ఘటనలపై టీఎంసీ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. కోల్‌కతా, హౌరా సహా పలు జిల్లాల్లో టీఎంసీ కార్యాలయాలు, కార్యకర్తలపై దాడులు, అగ్నిప్రమాదాలు, ధ్వంస ఘటనలు జరిగాయని పిటిషన్‌లో పేర్కొంది. బాధితులకు రక్షణ కల్పించడంతో పాటు ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోర్టును కోరింది. మే 14న మమతా బెనర్జీ న్యాయవాది దుస్తుల్లో కలకత్తా హైకోర్టుకు హాజరయ్యారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హెచ్?సీ సుజోయ్? పాల్ ఎదుట పిటిషన్‌కు సంబంధించిన విచారణలో పాల్గొన్నారు. ఇక ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన ఘర్షణలు, విధ్వంస ఘటనలపై బీజేపీ, టీఎంసీ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. పలువురు పార్టీ కార్యకర్తలు హత్యకు గురయ్యారని టీఎంసీ నాయకులు ఆరోపించగా, ఈ హింసాకాండపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

ఇటీవల ముగిసిన బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో, మొత్తం 294 సీట్లకుగాను బీజేపీ 207 సీట్లు కైవసం చేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్? (టీఎంసీ) 80 సీట్లకే పరిమితమై ఓటమి పాలైంది. ఇక మమతా బెనర్జీ కూడా తన సొంత నియోజకవర్గం భవానీపూర్‌లో తన మాజీ అనుచరుడు, ప్రస్తుత బీజేపీ నేత సువేందు అధికారి చేతిలో ఓడిపోయారు.

## మాజీ ఎమ్మెల్యే వర్ధంతి విజయవంతం చేయాలి

- అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్



**టీ మీడియా, మే 20, వనపర్తి బ్యూరో :** మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు గుమ్మడం జయరాములు 41 వర్ధంతి అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మే 24న జరుపబడును. అందరూ విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ... వనపర్తికి సేవ చేసిన బడుగు బలహీన వర్గాల ఎమ్మెల్యే లను మర్చిపోయిన ప్రజాప్రతినిధులకు గత పది సంవత్సరాలుగా కళ్ళు తెరిపించిన అఖిలపక్ష ఐక్యవేదిక ముందుకు వచ్చి మాజీ ఎమ్మెల్యేల జయంతులు, వర్ధంతిలు చేసి ప్రజలకు కూడా క్యాలెండర్ ద్వారా తెలిపిందని. అందుకు అనుగుణంగా మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు గుమ్మడం జయరాములు 41 వర్ధంతి అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మర్రికుంట పాలకేంద్రం దగ్గర 24వ తారీఖు ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు జరుగుతుందని. అన్ని ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు, ఆయన కుటుంబ సభ్యులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొంటారని, ఈ సందర్భంగా ప్రజలకు, పత్రికా, మీడియా విలేకరులకు ప్రత్యేక ఆహ్వానం పలుకుతున్నామని సతీష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి ఎన్నికల అధికార ప్రతినిధి కొత్త గొల్ల శంకర్, బిఎస్పి నాయకులు మైబూస్, లోక్సత్తా నాయకులు రాజ్ కుమార్, టిఆర్ఎస్ నాయకులు శివకుమార్ రాములు, రాజనగరం రామస్వామి, చందు, రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సురవరం ప్రతాప్ రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**టీ మీడియా, మే 20, వనపర్తి బ్యూరో :** తెలంగాణ వైతాళికుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాప్ రెడ్డి 130వ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. వనపర్తి మొట్టమొదటి ఎమ్మెల్యే అయిన సురవరం ప్రతాప్ రెడ్డి జీవిత చరిత్రను ఆవిష్కరించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన అన్నారు. మంగళవారం వనపర్తిలోని తన స్వగృహంలో సాహితీవేత్తలతో కలిసి నిర్వహించిన పత్రికా సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడారు."మహనీయుడు సురవరం"సురవరం ప్రతాప్ రెడ్డి మేధావి, సాహితీవేత్త, న్యాయవాది. తన రచనలతో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన మహనీయుడు. సామాజిక రుగ్మతలకు ఎదురొడ్డి నిలిచారు. 'దళిత దండోరా' స్థాపించి అణగారిన వర్గాలకు అండగా నిలిచిన అపర మేధావి" అని కొనియాడారు."గోల్కొండ పత్రిక స్థాపించి జర్నలిస్టులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. అలాంటి మహనీయుడి 130వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలి" అని పిలుపునిచ్చారు. శాశ్వత కట్టడాలుసురవరం ప్రతాప్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా వారి పేరిట గ్రంథాలయం ఏర్పాటు చేశామని, సురవరం పార్కులో కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించామని నిరంజన్ రెడ్డి వెల్లడించారు. **జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథులు** సురవరం జయంతి ఉత్సవాల్లో ఆయన జీవితంపై పరిశోధన చేసిన గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు, సాగునీటి రంగ నిపుణులు శ్రీధర్ రావు దేశ్‌పాండే, తెలంగాణ అస్తిత్వవాదంతో పాటు రాజకీయ, సామాజిక అంశాలను విశ్లేషించే సహచర ఉద్యమకారుడు వి. ప్రకాష్ పాల్గొంటారని తెలిపారు. "సాహితీవేత్తలు, విద్యావేత్తలు, సమాజం పట్ల పట్టింపు ఉన్న విజ్ఞులు అందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలి" అని నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, సాహితీవేత్తలు వీరయ్య, బలరామ్, బైరోజు చంద్రశేఖర్, కిరణ్, తిరుమలేశ్, జోహెబ్ హుస్సేన్, కుమార్, తోట శ్రీను పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద భద్రత



**టీ మీడియా, మే 20, రామకృష్ణాపూర్:**రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఆదిల్పేట్ ,పోన్నారం, గుడిపల్లి వెంకటాపూర్ ఐకెపి వరి ధాన్యం కొనుగోలు గ్రామాలను బుధవారం పట్టణ ఎస్సై శ్రీధర్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్ యంత్రాంగం గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా పారదర్శకంగా సాగేలా చూడడమే పోలీసుల ముఖ్య ఉద్దేశం. శాంతి భద్రతలుకొనుగోలు కేంద్రాల వద్ద ఎవరైనా గొడవలకు దిగిన రైతులను ఇబ్బంది పెట్టిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.రాకపోకల వల్ల సాధారణ ప్రజలకు, వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ ని క్రమబద్ధీకరించడం జరుగుతుంది.దలారీల పై నిఘా రైతులను మోసం చేసే దళారీలు, మధ్యవర్తులపై గట్టి నిఘా ఉంచాం ,అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.రైతులు ఐకెపి సిబ్బంది,మిల్లుల యజమానులు పోలీసులకు సహకరించి కొనుగోలు ప్రక్రియ ను విజయవంతం చేయాల్సిందిగా చెప్పారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి



**టీ మీడియా ,మే 20, పెబ్బేరు :**పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామానికి చెందిన పెబ్బేరు మండల మైనార్టీ ప్రెసిడెంట్ మొహమ్మద్ నసీరుద్దీన్ తండ్రి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ సందర్భంగా మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు .ఈ సందర్భంగా మాజీ మంత్రి వెంట మండల పార్టీ అధ్యక్షులు వనం రాములు ఎద్దులసాయినాథ్ గుమ్మడం గ్రామ సర్పంచ్ నాగేష్ టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆంజనేయులు ఎద్దుల పరుశురాముడు గ్రామ టీఆర్ఎస్ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## స్పోర్ట్స్ చైర్మన్ కు ఆహ్వాన పత్రిక



**టీ మీడియా ,మే 20, పెబ్బేరు:** పెబ్బేరు మండలంలోని వై శాఖపూర్ గ్రామంలో ఈ నెల 26వ తేదీన జరగనున్న పెద్దమ్మ తల్లి ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా హాజరు కావాలని హైదరాబాద్ లోని గచ్చిబౌలి కార్యలయంలో తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ డి సి సి అధ్యక్షులు శివసేన రెడ్డిని శాఖపూర్ కాంగ్రెస్ నాయకులు గోవింద్ నాయుడు ఆహ్వానించారుఈ కార్యక్రమం లో జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ వ్యవస్థకు భూమి పూజ



**టీ మీడియా ,మే 20 ,పెబ్బేరు :**పెబ్బేరు మండలంలోని కంచిరాపల్లి గ్రామంలోనీ 4 వ వార్డులో రోడ్లపై నీళ్లు నిలువ ఉండడం వలన దోమలు వ్యాప్తి వ్యాధులు ప్రబలే అవకాశముందని వార్డ్ ప్రజలు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయమని సమస్యను పరీక్షించమని గ్రామ సర్పంచ్ అరుణ జైపాల్ రెడ్డికి విజ్ఞప్తి చేయడం జరిగింది ఈ సమస్యను వెంటనే పరిస్కరించాలనీ గ్రామ సర్పంచ్ అరుణ జైపాల్ రెడ్డి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి భూమి పూజ చేయడం జరిగింది గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు ఈ భూమి పూజ కార్యక్రమంలో గ్రామ ప్రజలు వార్డ్ నెంబర్లు గ్రామ యువకులు గ్రామ సెక్రెటరీ మల్లయ్య పాల్గొన్నారు

## రిక్వెస్ట్ బస్ స్టాప్ కోసం వినతి పత్రం



**టీ మీడియా ,మే 20, పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని కర్నూల్ రోడ్డు సమీపంలో గల బూన్యాదిపూర్ అడ్డరోడ్డు వద్ద వెంటనే రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కౌన్సిలర్ శివ సాయి వనపర్తి డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బూన్యాదిపూర్ గ్రామానికి వెళ్లే ప్రయాణికులతో పాటు పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతవాసులు కొల్లాపూర్ చౌరస్తా వద్ద బస్సు దిగాల్సి వస్తోందని అక్కడి నుండి బూన్యాదిపూర్ రోడ్డు వరకు రావడానికి దాదాపు 2 కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు కనీసం అక్కడి నుండి ఆటో సౌకర్యం కూడా లేకపోవడంతో వృద్ధులు మహిళలు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు
బూన్యాదిపూర్ అడ్డరోడ్డు వద్ద అధికారికంగా ఒక రిక్వెస్ట్ బస్ స్టాపు ను ఏర్పాటు చేసి ఆర్టీసీ బస్సులు అక్కడ ఆగడమే కాకుండా ప్రయాణికులను ఎక్కించుకునేలా స్టేజి ఏర్పాటు చేయాలని వనపర్తి డిపో మేనేజర్ ను కోరారు దీనికి డిపో మేనేజర్ అందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు



## కురుమూర్తి స్వామి గుడి ఆదాయం 9,10,636

**టీ మీడియా,మే 20,ఆత్మకూరు:**మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామ సమీపంలో గల శ్రీ స్వామివారి హుండీ లెక్కింపు చేయగా వచ్చిన ఆదాయం రూపాయలు 9,10,636 రూపాయలు వచ్చిందని ఆలయ ధర్మకర్తల చైర్మన్ బత్తుల బాలరాజు ఈఓ మదనేశ్వర్ రెడ్డి తెలిపినారు దేవాదాయ శాఖ పర్యవేక్షకులు శ్రీనివాస్ పర్యవేక్షణలో శ్రీ స్వామి వారీ లెక్కింపు జరిగింది. పాల్గొన్నవారు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు వేగనాత్ మహిపాల్ రెడ్డి భరత్ కుమార్ రెడ్డి. ప్రేమ్ సాగర్ శ్రీనివాసులు శంకర్ నాగార్జున తిరుపతయ్య తిరుపతిరెడ్డి మహేందర్ భాస్కర చారి అర్జున్ బాలరాజు సౌజన్య ఆలయ అర్చకులు సిబ్బంది వెంకటేశ్వర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి భక్తులు పాల్గొన్నారు

# ఆధారాలు మాయం చేసిన బండి భగీరథ్

- మరో సెక్షన్ పెట్టిన పోలీసులు

పోలీసులు జోడించారు.కాగా, బండి భగీరథ్ వాడిన అత్యాధునిక ఐఫోన్‌లోని డాటాను, కీలక వీడియోలను డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. అతను తన సోషల్ మీడియా అకౌంట్లను మాయం చేసినట్లు నిర్ధారించినట్లు సమాచారం. ఈ నెల 8న బండి భగీరథ్‌పై పేట్‌బషీరాబాగ్‌లో కేసు నమోదు కాగానే నిందితుడి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. బండి భగీరథ్‌పై కేసు నమోదు నాటి నుంచి అరెస్ట్ వరకు హైడ్రామా, సాక్ష్యాల ధ్వంసానికి పాల్పడినట్టు ఇప్పటికే ఆరోపణలు రావడంతో, పోలీసులు కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాలను బయటకు తీస్తున్నట్టు సమాచారం.ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇప్పుడు ఆధునిక టెక్నాలజీ అస్త్రాన్ని ప్రయోగించనున్నట్టు సమాచారం. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు.. ఆ వెంటనే అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. తను వాడిన ఐఫోన్‌లోని డేటాను, కీలక వీడియోలను డిలీట్ చేయడం, సోషల్‌మీడియా అకౌంట్లను మాయంచేసి చట్టం నుంచి తప్పించుకోవచ్చని నిందితుడు భావించినట్టు పోలీసులు గుర్తించారని తెలిసింది. ఇందులో భాగంగానే ఫోన్‌ను పలుమార్లు ఫార్మాట్ చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కానీ నిందితుడు ఎంత తెలివిగా సాక్ష్యాలను తారుమారు చేసినా అంతకంటే వంద రెట్లు పవర్‌ఫుల్ టెక్నాలజీతో పోలీసులు ఉచ్చు బిగించేందుకు సన్నాహాలు ఇప్పటికే మొదలు పెట్టినట్టు తెలిసింది. ఈ కేసులో కీలక సాక్ష్యాలు సేకరించేందుకు పోలీసులకు నిందితుడి ఫోన్ కీలకంగా మారింది.

### ఐఫోన్ స్విచ్ఛాఫ్‌తో!

పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ ఫోన్ స్విచ్ఛాఫ్ కావడానికి ముందు ఎక్కడున్నాడు? ఎవరితో మాట్లాడాడు? చట్టం నుంచి అతనికి ఆశ్రయం కల్పించింది ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు సమాచారం. ఆ వివరాల కోసం సెల్‌టవర్ మ్యాపింగ్, కాల్‌డాటా రికార్డులను పోలీసులు సేకరిస్తున్నట్టు తెలిసింది. సాక్ష్యాలను నాశనం చేయడంలో నిందితుడికి సహకరించిన తెరవెనుక సూత్రధారులను కూడా ఈ మ్యాపింగ్ ద్వారా వెలుగులోకి తెచ్చేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

### డిలీట్ అయిన డాటా రిట్రీవ్!

ఐఫోన్‌లో సెక్యూరిటీ ఫీచర్లు అత్యంత కఠినంగా ఉంటాయి. అందుకే నిందితులు ఐఫోన్‌లో డాటాను డిలీట్ చేస్తే పోలీసులు ఏమి చేయరనే ధీమాలో ఉంటారని పోలీసులు చెప్తున్నారు, కానీ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిపుణుల వద్ద అత్యంత ఆధునిక సాఫ్ట్‌వేర్లు అందుబాటులో ఉండటంతో వివిధమార్గాల ద్వారా డిలీట్ అయిన డాటాను రిట్రీవ్ చేసేందుకు అవకాశాలున్నాయని పోలీస్ వర్గాలు చెప్తున్నాయి. అడ్వాన్స్‌డ్ ఫోరెన్సిక్ టూల్స్‌తో సెలిబ్రైట్ వంటి అంతర్జాతీయ స్థాయిలో ఫోరెన్సిక్ సాఫ్ట్‌వేర్‌లు, ఐఫోన్‌లోని నంద ఫ్లాష్ మెమొరీ నుంచి డిలీట్ అయిన డాటాలోని చాటింగ్, వీడియోలు, ఫొటోలను రికవరీ చేసేందుకు తగిన మార్గాలున్నాయని పోలీసులు ధీమాతో ఉన్నారు.ఐఫోన్‌లోని అంతర్గత మెమొరీని నిందితుడు పూర్తిగా ఫ్యాక్టరీ రీసెట్ చేసినా పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తేలేదని, ఐ క్లౌడ్‌లో బ్యాకప్ నుంచి కూడా డాటాను తిరిగి తీయొచ్చని చెప్తున్నారు. అవసరమైతే నిందితుడి క్లౌడ్ అకౌంట్ యాక్సెస్ కోసం కోర్టు ద్వారా యాపిల్ సంస్థను సంప్రదించేందుకూ సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఐక్లౌడ్ సర్వర్ల నుంచి నిందితుడికి సంబంధించిన ప్రతి డిజిటల్ ఆధారం డిలీట్ అయినా వాట్సాప్ బ్యాకప్‌లను, సోషల్‌మీడియా చాట్లను తిరిగి రాబట్టే అవకాశాలు కూడా లేకపోలేదని నిపుణులు పేర్కొంటున్నారు. సోషల్‌మీడియా అకౌంట్లను డిలీట్ చేసినా, వాటి సర్వర్ల నుంచి డాటాను సేకరించేందుకు సైతం పోలీసులు సిద్ధమవుతున్నారు.

### రిసీవ్డ్ డాటా సైతం!

ఒకవేళ నిందితుడి ఫోన్ నుంచి సమాచారాన్ని రాబట్టడంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే, ఈ కేసులో పూర్తిసాక్ష్యాలను కోర్టు ముందు నిలబెట్టేందుకు పోలీసులు ప్లాన్ 'బీ'ని కూడా అమలు చేసేందుకు సిద్ధమవున్నట్టు చర్చ జరుగుతుంది. ఈ కేసులో బాధితురాలి ఫోన్ సైతం మరో సాక్ష్యంగా మారనున్నదని పోలీస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నిందితుడు బాధితురాలికి పంపిన బెదిరింపులు, మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు బాధితురాలి నుంచి సేకరించి, వాటిని ధ్రువీకరించుకొని రిసీవ్డ్ డాటాలో పటిష్టమైన ప్రాథమిక సాక్ష్యాలు కోర్టు ముందు ఉంచనున్నారని తెలుస్తున్నది. పోక్సో కేసులో సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నించడం కూడా నేర తీవ్రతను మరింతగా పెంచుతుందని నిపుణులు చెప్తున్నారు.

## అన్నం తినడం పూర్తిగా మానేసిన ఏపీ సీఎం..

**-ఎక్కువగా ప్రొటీన్**



**టి మీడియా ,మే 20 , అమరావతి :** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు ఇటీవలి కాలంలో తన ఆహారపు అలవాట్ల గురించి తరచూ ప్రజలతో పంచుకునే ప్రయత్నం చేస్తూ ఉన్నారు. అన్నం మానేశాను, ప్రొటీన్ మాత్రమే తింటున్నాను... అనే మాట ఆయన పలుమార్లు చెబుతున్నారు. తాజాగా నెల్లూరు జిల్లాలో 'మత్స్యకార సేవలో' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, చేపల ప్రాధాన్యతపై మాట్లాడారు. ప్రొటీన్ తింటే ఆరోగ్యం బాగుంటుంది.. డయాబెటిస్ రాకుండా కాపాడుతుంది అంటూ తన డైట్ గురించి కూడా ప్రస్తావించారు. దీంతో ఇప్పుడు చంద్రబాబు ఆహారం, ఫిట్‌నెస్ రొటీన్ పై చర్చ మొదలైంది.చంద్రబాబు డైట్‌లో ముఖ్యంగా ప్రొటీన్‌కు ప్రాధాన్యత ఉంటుంది. రోజూ ఆహారంలో ఒక చేప ముక్క తప్పనిసరిగా ఉండేలా చూసుకుంటున్నట్లు ఆయన చెబుతున్నారు. కార్బోహైడ్రేట్స్‌ను తగ్గించి, ముఖ్యంగా వైట్ రైస్ వినియోగాన్ని తగ్గించడం ఆయన తీసుకున్న పెద్ద నిర్ణయం. ఆయిల్, సాల్ట్ కూడా కంట్రోల్‌లో ఉంచాలని తరచూ సూచిస్తున్నారు.ఫిట్‌గా ఉండటానికి, ఎనర్జీ మెంటైన్ చేయడానికి ప్రొటీన్ కీలకం అన్నది ఆయన స్టాండ్. ఇక ఆయన హెల్త్ మానిటరింగ్ కూడా టెక్నాలజీ ఆధారంగా జరుగుతోంది. హెల్త్ ట్రాకింగ్ రింగ్ ద్వారా నిద్ర, ప్రొటీన్ లెవల్స్, ఫిజికల్ యాక్టివిటీ అన్నీ ట్రాక్ చేస్తుంటారు. నిద్ర తక్కువైతే అలర్ట్ ఇస్తుంది... ప్రొటీన్ తక్కువైతే వెంటనే ఆహారంలో పెంచుకుంటాను అని ఆయన చెప్పిన సందర్భాలు ఉన్నాయి. అంటే, ఆయన డైట్ అనేది రెగ్యులర్ కాదు... పూర్తి లెక్కలతో నడిచే వ్యవస్థ.మొత్తానికి, చంద్రబాబు ఇప్పుడు ఫుడ్ హ్యాబిట్స్ విషయంలో ఒక కొత్త మెసేజ్ ఇస్తున్నారు. అన్నం తగ్గించి, ప్రొటీన్ పెంచే జీవనశైలి వైపు మళ్లాలని సూచిస్తున్నారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టే నాయకుడిగా తన ఇమేజ్‌ను మరింత బలపరుస్తున్నారు. ఇక ఆయన ఈ ప్రొటీన్ ఫార్ములా ఎంతవరకు ప్రజల్లో ఫాలో అవుతుందన్నది చూడాలి.

## ఈనెల 23న తెలంగాణ కేబినెట్ భేటీ

**- పలు అంశాలపై కీలక నిర్ణయాలు**



**టి మీడియా ,మే 20 ,హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ కేబినెట్ భేటీ ఈనెల 23వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. తొలుత ఈనెల 21న నిర్వహించనున్నట్లు ప్రభుత్వం జీవో జారీ చేసినా అదేరోజు సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 23వ తేదీకి మంత్రిమండలి సమావేశాన్ని మార్చుతూ సర్కారు మళ్లీ నిర్ణయం తీసుకుంది.23న యాదగిరిగుట్టలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అదేరోజు అక్కడే మంత్రివర్గ సమావేశం ఉంటుందనే ప్రచారం జరిగింది. అయితే ప్రభుత్వవర్గాలు మాత్రం హైదరాబాద్‌లోనే కేబినెట్ సమావేశం ఉంటుందని స్పష్టం చేశాయి. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.రెండోదశ ఇందిరమ్మ ఇళ్ల పథకం జూన్ 2 నుంచి ప్రారంభం కానుండటంతో లబ్ధిదారుల ఎంపికలో ఉండాల్సిన విధివిధానాలు, మార్పులపై కేబినెట్?లో చర్చించనున్నారు. హ్యామ్ రోడ్ల టెండర్ల ప్రక్రియ ముగియడంతో పనుల వేగవంతంపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. భూముల విలువల్లో సవరణ, సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యోగ నియామకాలు, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ, జర్నలిస్టుల ఇళ్లస్థలాలు, ఉద్యోగులు, పింఛనుదారుల ఆరోగ్య కార్డులు అంశాలను చర్చించే అవకాశాలున్నాయి. జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నూతన సంక్షేమ కార్యక్రమాలు, పథకాల ప్రారంభంపై ఈ సందర్భంగా చర్చించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

### వేద పాఠశాలకు సీఎం శంకుస్థాపన

ఈ నెల 23వ తేదీన యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఈఓ భవాని పేర్కొన్నారు. అదేరోజున యాదగిరిగుట్టలోని టెంపుల్ సిటీలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వేద పాఠశాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

### రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

అదే రోజు కొండపైన నిర్మించనున్న కళ్యాణ మండపం, దీక్షపరుల సదనం, మెట్ల మార్గానికి పై కప్పు, ప్రధానాలయం వాయువ్య దిశలో మాడ వీధుల్లోకి వెళ్లడానికి నిర్మించే మెట్ల మార్గానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

### ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు

22న యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి రానున్నారని అన్నారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు నరసింహ స్వామి దర్శించుకుంటారని తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం సాయంత్రం 6 గంటల సమయంలో కళావేధిక ప్రాంతానికి చేరుకుంటారని చెప్పారు. భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తర్వాత 32 మంది ప్రసిద్ధ వేదపండితులతో చదుర్వేద పారాయణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆపై కంచి పీఠాధిపతులు అనుగ్రహం బాషణం చేయనున్నారని చెప్పారు.

## ఉన్నోడిలా నటించాడు.. ఉన్నకాడికి దోచేశాడు..

**-సీన్‌కట్‌చేస్తే..**



**టి మీడియా ,మే 20 ,హైదరాబాద్ బ్యూరో :** తన దగ్గర బాగా డబ్బులు ఉన్నాయని.. మ్యాట్రిమోనీలో నకిలీ ప్రొఫైల్స్ చేసి మహిళ నుంచి డబ్బులు కాజేస్తున్న ఓ కేటుడానికి సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో 20కిపైగా కేసులు ఉన్నట్టు గుర్తించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం. నిందితుడు ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన మందా వెంకట కామేషుగా గుర్తించారు. ఇతను తెలుగు , రెడ్డి, బ్రాహ్మణ, కమ్మ వంటి ప్రముఖ మ్యాట్రిమోనీ సైట్‌లలో నకిలీ ప్రొఫైల్‌లను క్రియేట్ చేసుకొని.. తాను దనవంతుడినని అమ్మాయిలకు వలవేసినట్టు పోలీసులు గుర్తించారు.పెళ్లి సంబంధాల కోసం చూసే మహిళలను టార్గెట్ చేస్తూ.. వాట్సాప్ కాల్స్, ఇన్‌స్టాగ్రామ్ చాట్‌ల ద్వారా వారితో సన్నిహితంగా మాట్లాడేవాడు. వాళ్లు పూర్తిగా అతన్ని నమ్మిన తర్వాత ఏదో ఒక సాకు తనకు డబ్బులు కావాలని అడిగేవాడు. అప్పటికే అతన్ని గుడ్డిగా నమ్మిన బాధితులు అతనికి డబ్బులు సమర్పించుకునేవారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, వెంటనే సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930 లో గానీ ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.

## వాటర్ బోర్డులో ఉద్యోగాలు..'

**-జలమండలి సీరియస్ వార్నింగ్**




**టి మీడియా ,మే 20 , హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర జలమండలిలో ఉద్యోగాలు అంటూ నెట్టింట ప్రచారం జరగడంపై ఆ శాఖ క్లారిటీ ఇచ్చింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, అవన్నీ అసత్య ప్రచారాలని జలమండలి స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ పోస్టర్లపై అప్రమత్తంగా ఉండాలి తెలిపింది. జలమండలిలో ప్రస్తుతం ఎలాంటి నియామకాలు లేవని స్పష్టం చేసింది. ఉద్యోగ నియామకాలు ఉంటే టీ జి పీ స్ సి లేదా అధికారిక సంస్థల ద్వారానే ప్రకటనలు విడుదల చేస్తామని వెల్లడించింది.ఇటీవల సోషల్ మీడియా వేదికగా "హైదరాబాద్ నీటి సరఫరా బోర్డు, తెలంగాణ రిక్రూట్మెంట్ 2026" పేరుతో ఒక పోస్టర్ వైరల్ అవుతోంది. ఆ పోస్టర్‌లో జలమండలిలో భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు, వేతనాలు, అర్హతల వివరాలు పేర్కొంటూ తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా జలమండలి క్లారిటీ ఇస్తూ ప్రకటన వెలువరించింది. ఇందులో జలమండలి స్పష్టం చేయునది ఏమనగా.. ప్రస్తుతం పోస్టర్‌లో పేర్కొన్న విధంగా ఎలాంటి నియామక ప్రక్రియను జలమండలి చేపట్టలేదు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న సమాచారం పూర్తిగా అసత్యం.. ఫేక్ న్యూస్.జలమండలిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాల్సి వచ్చిన సందర్భంలో, అవి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా సంబంధిత అధికారిక సంస్థల ద్వారా మాత్రమే నిర్వహించబడతాయి. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటనలు ప్రభుత్వ, జలమండలి అధికారిక వెబ్‌సైట్లు, విశ్వసనీయ మీడియా వేదికల ద్వారా విడుదల చేయబడతాయి. కావున ప్రజలు, ఉద్యోగార్థులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నిర్ధారణ లేని పోస్టర్లు, వార్తలు, తప్పుడు ప్రకటనలను నమ్మవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోందని అందులో పేర్కొంది. అధికారిక సమాచారం కోసం ప్రభుత్వ, జలమండలి అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని సూచించింది. తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది.



## కెమెరా కన్ను చూడలేనంటోంది

- ఉన్నవి 12 లక్షలు
- పని చేసేవి 3.8 లక్షలు

**టి మీడియా ,మే 20 ,హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్? హైటెక్ ?సిటీకి అత్యంత దగ్గరలో ఓ 3 సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. ఆ మూడింటిలో ఒక కెమెరా పూర్తిగా పని చేయడమే లేదు. మిగిలిన రెండు కెమెరాలు ఆకాశానికి చూస్తున్నాయి. ఇదే తరహాలో ఒకటి, రెండు కాదు నగరంలోని 4 కమిషనరేట్ల పరిధిలోని, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వీటి పరిస్థితి ఇలాగే అధ్వాన్నంగా మారింది.రాష్ట్రంలో అనేక చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ప్రస్తుతం కేవలం 32 శాతం మాత్రమే పని చేస్తున్నాయి. ఈ మాటలన్నది సాధారణ పౌరుడు కాదు. కొత్తగా డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్?. ఈ విషయాన్ని తన తొలి మీడియా సమావేశంలో వెల్లడించారు.పని చేసేవి 5 మాత్రమే : 2025 డిసెంబరు నాటికి తెలంగాణ వ్యాప్తంగా 12.09 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పోలీస్ గణాంకాలు పేర్కొంటున్నాయి. అయితే వీటిలో సుమారు 8.22 లక్షల కెమెరాలు ఏదో ఒక కారణంతో పని చేయడం మానేసి వృథాగా ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్? కమిషనరేట్?లో సుమారు 1,500 సీసీ కెమెరాలున్న ఓ పోలీస్?స్టేషన్? పరిధిలో కేవలం 5 మాత్రమే పని చేస్తున్నాయని తెలిసింది. ఈ పరిస్థితులును పరిశీలిస్తే రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి తీవ్రత ఏ తరహాలో ఉందో అర్థం చేసుకోవచ్చు.ప్రపంచంలోనే అత్యధిక సీసీ కెమెరాలు కలిగిన టాప్?-20 నగరాల్లో హైదరాబాద్? ఒకటిగా పేరుగాంచింది. అయితే ఇలాంటి నగరంలోనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడటం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఏదైనా నేరం జరిగితే సీసీ కెమెరా ఫుటేజీలు, సెల్?ఫోన్? టవర్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఇలాంటి పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో సీసీ కెమెరాల దుస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఫుటేజీలు లభించకపోవడంతో రాష్ట్రంలోని అనేక కేసుల దర్యాప్తు ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి.

### నాణ్యత ప్రశ్నార్థకం

ఒక్క సీసీ కెమెరా వంది మంది పోలీసులతో సమానం! లండన్?లో ఒక వ్యక్తి ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లొచ్చే సరికి సీసీ కెమెరాలు అతడిని 214 సార్లు రికార్డు చేస్తాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని నేర నియంత్రణకు వీటిని ఏర్పాటు చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలి.

### నేను సైతం ప్రాజెక్టు కింద

ప్రజా భద్రత చట్టంలో భాగంగా కనీసం 100 మంది గుమిగూడే ప్రతీ కూడలి వద్ద, వివిధ ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాల పర్యవేక్షణ తప్పనిసరి అని గతంలో డీజీపీ హోదాలో మహేందర్ ?రెడ్డి పేర్కొన్నారు. దీంతో అప్పట్లో పోలీస్ ?శాఖ సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రభుత్వ నిధులతో హైదరాబాద్? సహా రాష్ట్రంలోని ప్రముఖ నగరాలు, పట్టణాలు, కూడళ్లు, ప్రధాన రహదారులు, అధిక జనభా గుమిగూడే ప్రాంతాల్లో 'నేను సైతం' ప్రాజెక్టు కింద అనేక చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది.ఇదే తరహాలో ప్రతి సంవత్సరం వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేసింది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సరం చివరి నాటికి మొత్తం కెమెరాల సంఖ్య 12,09,782గా నమోదైంది. అయితే ఇలా ఏర్పాటు చేసిన వాటిలో చాలా వరకు నాణ్యత సరిగా లేదనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. హైదరాబాద్?లోని ప్రధాన కూడళ్లలోనే నైట్ ?విజన్ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో అప్పట్లోనే కీలక ఉన్నతాధికారి ఒకరు సమస్యను గుర్తించి తప్పుబట్టడం చర్చనీయాంశమైంది.

### కొత్తవి ఏర్పాటు చేయడమే తప్పనిసరి

సాధారణంగా సీసీ కెమెరాలు బిగించిన నాలుగు సంవత్సరాల వరకే వీటి మన్నిక ఉంటుంది. వృత్తి పరమైన నాణ్యత కలిగినవైతే 7 నుంచి 10 సంవత్సరాల వరకు అవకాశం ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే రూ.వందల కోట్లతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి పనికిరాకుండా పోవడం, మరికొన్ని మరమ్మతులతో బాగయ్యే అవకాశం లేకపోవడమే ఇందుకు కారణమని సాంకేతిక నిపుణులు అంటున్నారు.ఇలాంటి పాత కెమెరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడమే తప్పనిసరిగా కనిపిస్తోంది. అప్పట్లోనే రూ.వందల కోట్లు ఖర్చు చేసిన వ్యాపార సంస్థలు, కాలనీ సంఘాలు మళ్లీ డబ్బులు పెట్టడం సులువు కాదనే అభిప్రాయం వస్తోంది. దీంతో ఈ సీసీ కెమెరాల వ్యవస్థను బలోపేతం చేయడం ఎలా అనేది ప్రస్తుతం పోలీసు అధికారులకు సవాలుగా మారింది.